కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రూ.3,662.17 కోట్ల విలువైన డివిడెండ్ చెక్కును అందజేస్తున్న ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మొహంతి

రికార్డు స్థాయికి సూచీలు

82,134కి సెన్సెక్స్, 25,151 పాయింట్లకు నిఫ్టీ

ముంబై, ఆగస్టు 29: దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. బ్లూచిప్ సంస్థల ర్యాలీతో సూచీలు మరో శిఖరానికి చేరుకున్నాయి. గత పదిరోజులుగా పెరుగుతూ వచ్చిన సూచీలు గురువారం మరో రికార్డు స్థాయిలో ముగిశాయి. అన్ని రంగాల షేర్లలో క్రయ విక్రయాలు జోరుగా సాగడం, అంతర్జాతీయ పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడంతో ఇంట్రాడేలో ఆల్‌టైం హైకి చేరుకున్న సూచీలు చివర్లో ఇదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల స్థాయిలో పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 349.05 పాయింట్లు అందుకొని 82,134.61 వద్ద ముగిసింది. సూచీలకు ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు కావడం విశేషం. గత ఎనిమిది సెషన్లలో సెన్సెక్స్ 1,709.93 పాయింట్లు లేదా 2.12 శాతం లాభపడింది. మరో సూచీ నిఫ్టీ 25 వేల పాయింట్ల పైన ముగిసింది. ఒక దశలో 140 పాయింట్లు లాభపడిన నిఫ్టీ చివరకు 99.60 పాయింట్లు అందుకొని 25,151.96 వద్ద స్థిరపడింది. గత 11 సెషన్లలో నిఫ్టీ 1,012.95 పాయింట్లు లేదా 4.19 శాతం లాభపడింది. మార్కెట్లో టాటా మోటర్స్ అత్యధికంగా నాలుగు శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఐటీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, టెక్ మహీంద్రా, మారుతి, ఎస్బీఐలు లాభాల్లో ముగిశాయి. బోనస్ షేరును ప్రకటించడంతో రిలయన్స్ షేరు ఏకంగా 1.50 శాతం లాభపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.30,389.92 కోట్లు పెరిగి రూ.20,57,382.97 కోట్లకు చేరుకున్నది. కానీ, మహీంద్రా అండ్ మహీంద్రా, సన్ ఫార్మా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఇన్ఫోసిస్, టాటా స్టీల్‌లు నష్టపోయాయి.

నిర్మాణ రంగంలోకి ఎంఎస్ఎన్ గ్రూపు



కొండాపూర్, ఆగస్టు 29 : ఫార్మా దిగ్గజాల్లో ఒకటైన ఎంఎస్ఎన్ గ్రూపు తాజాగా రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగుపెట్టింది. ఎంఎస్ఎన్ రియల్టీని స్థాపించింది. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ గ్రూపు ఫౌండర్, సీఎండీ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. నిర్మాణరంగంలో తమకంటూ ప్రత్యేకతను చాటడానికి ఈ రంగంలోకి అడుగుపెట్టినట్లు, ముఖ్యంగా వినియోగదారులకు నాణ్యత ప్రమాణాలతో సకల సౌకర్యవంతమైన గృహాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్‌లో ఎంఎస్ఎన్ రియాలిటీ లోగోను ఆయన ఆవిష్కరించారు. ఫార్మా రంగంలో ఎంతో కాలంగా సుదీర్ఘ సేవలనందిస్తున్న ఎంఎస్ఎన్ గ్రూపు.. రియల్ ఎస్టేట్ రంగంలోనూ ప్రత్యేక ముద్రను వేసేలా సేవలను అందించనున్నట్లు తెలిపారు. రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణాలను వినియోగదారులకు అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, వచ్చే రెండు నెలలో ప్రభుత్వ అనుమతులతో హైదరాబాద్‌లో తమ మొదటి ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు తెలిపారు.

100జీబీదాకా ఉచిత స్టోరేజీ

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ

- వినియోగదారులకు జియో ఏఐ, క్లౌడ్ వెల్‌కమ్ ఆఫర్
- దీపావళి నుంచి అందుబాటులోకి..
- చౌక ధరలకు డాటా-పవర్డ్ ఏఐ సర్వీసులు

ముంబై, ఆగస్టు 29: జియో వినియోగదారులకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ బంపర్ ఆఫర్ ఇచ్చారు. ఏఐ క్లౌడ్ వెల్‌కమ్ ఆఫర్‌ను ప్రకటించారు. ఇందులోభాగంగా జియో యూజర్లు 100జీబీదాకా ఉచిత క్లౌడ్ స్టోరేజీని పొందే అవకాశాన్ని కల్పించారు. దీంతో జియో కస్టమర్లు తమ ఫోటోలను, వీడియోలను, డాక్యుమెంట్లను, డిజిటల్ కంటెంట్, ఇతర డాటాను స్వేచ్ఛగా, మరింత భద్రంగా దాచుకునే సౌలభ్యం లభించింది. రాబోయే దీపావళి నుంచి ఈ ఆఫర్ అందుబాటులోకి రానున్నది. దీంతో ఇక చాలా చౌక ధరలకే మార్కెట్‌లో క్లౌడ్ డాటా స్టోరేజీ, డాటా-పవర్డ్ ఏఐ సర్వీసులు అన్నిచోట్ల, అందరికీ దొరుకుతాయని అంబానీ అన్నారు. గురువారం ఇక్కడ జరిగిన కంపెనీ 47వ వార్షిక భాగస్వాముల సమావేశం (ఏజీఎం)లో ఈ మేరకు అన్ని వివరాలందించారు.

మా సంపదనేం దాచట్లేదు

ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఈ స్థాయికి వచ్చామని, దీని వెనుక ఎంతో కష్టం దాగి ఉన్నదని ముకేశ్ అంబానీ తమ సంస్థ ఎదుగుదలను వివరించారు. ఏజీఎంలో ఒకింత ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. రిలయన్స్ కింది స్థాయి నుంచి పైకొచ్చిందన్న ఆయన.. తమకు భారీ మూలాలేమీ లేవని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే మా సంపదను దాచుకోవట్లేదని, మరింత సంపదను సృష్టిస్తూ జాతి గర్వించదగ్గ కంపెనీగా రిలయన్స్‌ను తీర్చిదిద్దినట్టు పేర్కొన్నారు. బహుళ వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో విస్తరించిన రిలయన్స్.. భారతీయ అత్యంత విలువైన కంపెనీగా నిలిచిన విషయం తెలిసిందే. ఆయిల్ రిఫైనింగ్, ఆయిల్-గ్యాస్ ఉత్పత్తి, పెట్రో కెమికల్స్, టెలికం, రిటైల్, మీడియా ఇలా దాదాపు అన్ని కీలక రంగాల్లో రిలయన్స్ కంపెనీలున్న సంగతీ విదితమే. కాగా, లాభాల కోసమో లేక సంపదను దాచుకోవడానికో తాము వ్యాపార కార్యకలాపాలను చేయడం లేదని ముకేశ్ అంబానీ అన్నారు. జాతి సంపద సృష్టికే పనిచేస్తున్నట్టు తెలిపారు. తర్వాతి తరాలకు రిలయన్స్‌ను గొప్ప సంపదగా అప్పజెప్తామన్నారు. ఉత్పత్తి, సేవల్లో అత్యంత నాణ్యతను పాటిస్తున్నామని, దేశ వినియోగదారుల జీవన ప్రమాణాలను పెంచుతున్నామని వెల్లడించారు.

భారత్‌కు ఎనర్జీ సెక్యూరిటీ..

భారత్‌కు ఎనర్జీ సెక్యూరిటీని కల్పించే బాధ్యతను రిలయన్స్ తీసుకున్నదని ముకేశ్ అంబానీ అన్నారు. ఈ క్రమంలోనే పునరుత్పాదక శక్తిపై దృష్టి సారించామని, సోలార్ పవర్ విస్తరణ దిశగా అడుగులు వేస్తున్నామని వివరించారు. '2018 జూలైలో 100 బిలియన్ డాలర్ల విలువను రిలయన్స్ చేరుకున్నది. 2022లో 250 బిలియన్ డాలర్లకు చేరింది. 2027 నాటికి ఇది రెట్టింపవుతుందని నేను వాగ్దానం చేస్తున్నాను. భవిష్యత్తులో లాభాలపరంగా, వృద్ధిపరంగా రిలయన్స్ కొత్త శిఖరాలను అధిరోహించగలదు' అని ముకేశ్ చెప్పారు.

ప్రపంచంలో జియోనే టాప్

ప్రపంచంలో ఇప్పుడు అతిపెద్ద మొబైల్ డాటా కంపెనీగా జియోనే ఉందని ముకేశ్ తెలియజేశారు. గడిచిన 8 ఏండ్లలో సంస్థ కస్టమర్లు 49 కోట్లకు పెరిగారని, సగటున నెలకు 30జీబీకిపైగా డాటా వాడుతున్నారని చెప్పారు. ఇక ప్రపంచంలో అతిపెద్ద డాటా మార్కెట్‌గా భారతే ఉందన్న ఆయన.. ఇందుకు జియోనే కారణమన్నారు. అంతర్జాతీయ మొబైల్ ట్రాఫిక్‌లో జియో వాటా 8 శాతంగా ఉన్నట్టు వివరించారు. అలాగే 5జీ, 6జీ టెక్నాలజీల్లో జియోకు 350 పేటెంట్లున్నట్టు ఈ సందర్భంగా ముకేశ్ అంబానీ ప్రకటించారు. ఈ క్రమంలోనే ప్రతి నెలా 10 లక్షల బ్రాడ్‌బాండ్ కనెక్షన్లను లక్ష్యంగా చేసుకోబోతున్నట్టు తెలిపారు. అంతేగాక 2 కోట్లకుపైగా చిన్న-మధ్యతరహా వ్యాపారాలను, 15 లక్షల పాఠశాలలు-కళాశాలలను, 70వేలకుపైగా దవాఖానలను, 12 లక్షల డాక్టర్లను బ్రాడ్‌బాండ్‌తో కనెక్ట్ చేసే దిశగా వెళ్తున్నట్టు వెల్లడించారు.

1:1 బోనస్ షేర్ల పరిశీలన

తమ ఈక్విటీ షేర్‌హోల్డర్లకు 1:1 శ్రేణిలో బోనస్ షేర్లను ఇవ్వాలని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ భావిస్తున్నది. ఈ అంశాన్ని సంస్థ బోర్డు సెప్టెంబర్ 5న పరిశీలించనున్నది. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ తెలియజేసింది. కాగా, 2017 సెప్టెంబర్‌లో చివరిసారిగా బోనస్ షేర్లను జారీ చేసింది రిలయన్స్. మళ్లీ ఏడేండ్ల తర్వాత బోనస్ షేర్లను సిఫార్సు చేసే దిశగా కంపెనీ వెళ్తుండటం గమనార్హం. 2009లోనూ 1:1 ప్రాతిపదికన వాటాదారులకు బోనస్ షేర్లను రిలయన్స్ ఇండస్ట్రీస్ అందించిన సంగతి విదితమే.

లగ్జరీ నగల వ్యాపారంలోకి..

వచ్చే 3-4 ఏండ్లలో రిటైల్ వ్యాపారాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్టు రిలయన్స్ ప్రకటించింది. ఇందులో భాగంగానే లగ్జరీ జ్యుయెల్లరీ సెగ్మెంట్‌లోకి అడుగు పెట్టాలని యోచిస్తున్నట్టు రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఇషా అంబానీ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో రిలయన్స్ రిటైల్ రెవిన్యూ రూ.3 లక్షల కోట్ల మార్కును దాటినట్టు చెప్పారు. వచ్చే 4 ఏండ్లలో దీన్ని రూ.6 లక్షల కోట్లకు తీసుకెళ్తామన్న ఆశాభావాన్ని కనబర్చారు. రిటైల్ రంగంలో తమకు 30 కోట్లకుపైగా కస్టమర్లున్నట్టు పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే రిలయన్స్ రిటైల్ విలువ 100 బిలియన్ డాలర్లను దాటిన సంగతి తెలిసిందే.

ఏజీఎం ముఖ్యాంశాలు

- రిలయన్స్ తమ తొలి సోలార్ గిగా-ఫ్యాక్టరీని ఈ ఏడాదే ఏర్పాటు చేయాలని చూస్తున్నది.
- ఇందులో పీవీ మాడ్యుల్స్, సెల్స్, వేఫర్స్-ఇంగోట్స్, పాలీసిలికాన్, గ్లాస్ తయారు కానున్నాయి.
- ఈ ఏడాదే 20 గిగావాట్స్ సోలార్ పీవీ తొలి రైలు తయారీ మొ దలు.
- 2025కల్లా మెగావాట్ స్థాయిలో సోడియం-ఐయాన్ సెల్ ఉత్పత్తిని పారిశ్రామికీకరణ. 2026లో ఏటా 50 మెగావాట్ లిథియం బ్యాటరీ సెల్స్ పైలట్.
- 2030 నాటికి 100 గిగావాట్ల పునరుత్పాదక శక్తి సామర్థ్యం ఆధారంగా కొత్త ఇంధన వ్యాపారాలను అభివృద్ధి చేసే దిశగా రిలయన్స్. ఇందుకోసం మూడేండ్లపాటు 10 బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టాలని 2021 లోనే నిర్ణయించుకున్న సంస్థ.
- రెన్యూవబుల్ ఎక్విప్‌మెంట్, బ్యాటరీ స్టోరేజీ, ఫ్యూయల్ సెల్స్, హైడ్రోజన్ తయారీ కోసం గుజరాత్‌లోని జమ్‌నగర్‌లో 4 గిగా ఫ్యాక్టరీల నిర్మాణం.
- జియో క్లౌడ్‌లో ఏ కాల్‌నైనా యూజర్లు రికార్డు చేసుకొని, స్టోర్ చేసుకునేలా జియోఫోన్‌కాల్ ఏఐ సర్వీస్‌ను పరిచయం చేసిన ఆకాశ్ అంబానీ
- జామ్‌నగర్‌లో గిగావాట్ స్థాయిలో ఏఐ-రెడీ డాటా సెంటర్లను ఏర్పాటు చేయనున్న రిలయన్స్.
- భారతీయ వినోద పరిశ్రమలో వాల్ట్ డిస్నీతో రిలయన్స్ డీల్ ఓ నూతన శకానికి నాంది పలికిందన్న ముకేశ్ అంబానీ. ఈ డీల్‌తో రూ.70వేల కోట్ల సంస్థ ఏర్పడుతుండగా.. ఇందులో డిస్నీ హాట్‌స్టార్, జియో సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ వేదికలతోపాటు 120 టెలివిజన్ చానల్స్ ఉంటున్నాయి.

అంబానీని దాటేసిన అదానీ

- 11.6 లక్షల కోట్ల సంపదతో దేశీయ కుబేరుడు
- హురూన్ ఇండియా జాబితా విడుదల



న్యూఢిల్లీ, ఆగస్టు 29: హిండెన్‌బర్గ్ దెబ్బకు లక్షల కోట్ల సంపదను కోల్పోయిన గౌతమ్ అదానీ మళ్లీ దేశీయ కుబేరుడిగా అవతరించారు. ప్రస్తుత సంవత్సరానికిగాను తన సంపద 95 శాతం పెరిగి రూ.11.6 లక్షల కోట్లతో దేశీయ శ్రీమంతుల జాబితాలో అగ్రస్థానం దక్కించుకున్నారు. ఈ స్థానంలో కొనసాగిన ముకేశ్ అంబానీ రెండో స్థానానికి పడిపోయినట్టు 2024 సంవత్సరానికిగాను హురూన్ ఇండియా విడుదల చేసిన సంపన్నవర్గాల జాబితాలో పేర్కొంది. గతేడాదికాలంలో ముకేశ్ అంబానీ సంపద 25 శాతం పెరిగి రూ.10.14 లక్షల కోట్లుగా నమోదైంది. 2023లో గౌతమ్ అదానీ సంపద 57 శాతం కరిగిపోయి రూ.4.74 లక్షల కోట్లకు పరిమితంకాగా, ఇదే సమయంలో ముకేశ్ అంబానీ సంపద రూ.8.08 లక్షల కోట్లకు ఎగబాకింది. ఆ తర్వాతి స్థానాల్లో రూ.3.14 లక్షల కోట్లతో హెచ్‌సీఎల్ ఫౌండర్ శివ్ నాడర్ మూడో స్థానంలో నిలువగా, రూ.2.89 లక్షల కోట్లతో సైరస్ పూనావాల నిలిచారు. రూ.2.50 లక్షల కోట్ల సంపదతో దిలీప్ సంఘ్వీ ఐదో స్థానం వరించింది. భారత్‌లో బిలియనీర్ల సంఖ్య నానాటికి పెరుగుతున్నదని తెలిపింది. గతేడాది భారత్‌లో ప్రతి 5 రోజులకొక బిలయనీరు తయారైనట్లు నివేదిక వెల్లడించింది.

- రూ.7,300 కోట్ల సంపదతో బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తొలిసారిగా ఈ జాబితాలో చోటు లభించింది.
- అతి పిన్న వయస్సు కలిగిన జెప్టో కో-ఫౌండర్ కైవల్య వొహ్రా తొలిసారిగా చోటు సంపాదించుకున్నారు. రూ.3,600 కోట్ల సంపద కలిగివున్నారు.
- అపర్ణ కన్‌స్ట్రక్షన్ ఫౌండర్ సీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ సుబ్రమణియన్ రెడ్డిల సంపద అత్యధికంగా పెరిగింది.
- పొంగులేటి హర్ష రెడ్డి(కాంగ్రెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తనయుడు) రూ.1,400 కోట్ల వ్యక్తిగత సంపదతో ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు.
- రూ.1,000 కోట్ల కంటే అధిక ఆస్తి కలిగిన వారు కొత్తగా 220 మంది జతవడంతో మొత్తం సంఖ్య 1,539కి చేరుకున్నారు.

మూడో స్థానంలో హైదరాబాద్

హైదరాబాద్ మరో ఘనతను సాధించింది. నగరాల వారీగా శ్రీమంతులు జాబితాలో తొలిసారిగా బెంగళూరును అధిగమించి హైదరాబాద్ మూడో స్థానం దక్కించుకున్నది. నగరం నుంచి 104 మంది కుబేరులు ఉన్నట్లు హురూన్ విడుదల చేసిన జాబితాలో వెల్లడించింది. 386 మందితో ముంబై ఎప్పటిలాగే తొలి స్థానంలో నిలువగా, 217 మందితో న్యూఢిల్లీ ఆ తర్వాతి స్థానం వరించింది. హైదరాబాద్‌లో కొత్తగా ఈ ఏడాది 17 మంది శ్రీమంతుల జాబితాలో చేరినట్లు పేర్కొంది. అలాగే బిలియనీర్లు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఐదో స్థానంలో నిలిచింది.

తెలుగు శ్రీమంతులు వీరే..

వ్యక్తి	సంపద (రూ.కోట్లలో)
మురళి దివీస్(దివీస్)	76,100
పీ పిచ్చిరెడ్డి(మెయిల్)	54,800
పీవీ కృష్ణా రెడ్డి(మెయిల్)	52,700
జీఎం రావు(జీఎమ్మార్)	36,300
పీవీ రాంప్రసాద్ రెడ్డి(అరబిందో)	35,100
బండి పార్థసారథి రెడ్డి(హెటిరో)	29,900
ప్రతాప్ రెడ్డి(అపోలో గ్రూపు)	28,400

రైల్వే అండర్ ఓబీల నిర్మాణాలు త్వరగా చేపట్టాలి



దక్షిణ మధ్య రైల్వే జీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 29: పెద్దపల్లి నియోజకవర్గంలో అర్ధంతంగా నిలిచిపోయిన రైల్వే అండర్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలను త్వరగా చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యే విజయరమణారావు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌కు అందజేశారు. గురువారం హైదరాబాద్‌లోని రైల్ నిలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని నియోజకవర్గంలోని రైల్వే అండర్ ఓవర్ బ్రిడ్జ్ సమస్యలు వివరించారు. పెద్దపల్లి-చీకురాయి, ఉప్పరపల్లి-కొలనూర్, ఓదెల, కొత్తపల్లి, గౌరెడ్డిపేట్, రాఘవపూర్, రైల్వే అండర్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలు అర్ధంతంగా నిలిచిపోయాయని, వాటిని త్వరగా నిర్మాణాలు చేపట్టాలని కోరారు. రైల్వే అండర్ ఓవర్ బ్రిడ్జిల మీదుగా వెళ్లే ప్రయాణికులు దారులు సరిగాలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని కోరారు. వెంటనే రైల్వే అండర్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ పార్లమెంట్ సభ్యులు కిరణ్‌కుమార్ రెడ్డి, బలరాం నాయక్, ఆర్అండ్‌బి డెవలప్‌మెంట్ చైర్మన్ రాంరెడ్డి , రైల్వే ఉన్నత అధికారులు తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. కనగర్తి గ్రామానికి చెందిన దివ్యాంగుడైన కడారి తిరుపతికి బాల వికాస పథకం ద్వారా బ్యాటరీతో నడిచే వీల్ చైర్‌ను ఎమ్మెల్యే విజయరమణారావు బుధవారం రాత్రి అందజేశారు. దివ్యాంగులకు ప్రతి ఒక్కరం మనోధైర్యం ఇచ్చి ముందుకు నడిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పిట్టల రవికుమార్, నాయకులు చొప్పరి రాజయ్య, కిసిరెడ్డి మహేందర్‌రెడ్డి, మచ్చ నాగరాజు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు క్రీడా పోటీలు

రామగిరి, ఆగస్టు 29: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు గోదావరిఖని ఏసీపీ రమేష్, జగిత్యాల జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈఈ సతీష్, సూపరింటెండెంట్ రవికుమార్, లైబ్రరీ ఇన్‌ఛార్జి రమణ, పీడీలు కృష్ణారెడ్డి, సునీల్ పాల్గొన్నారు

నిత్యావసరాలు అందజేత

రామగిరి, ఆగస్టు 29: లయన్స్ క్లబ్ డైరెక్టర్ సురేశ్ బాబు జన్మదినం సందర్భంగా కల్వచర్లకు చెందిన మంథని సతీశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి పని చేయలేని స్థితిలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడని తెలుసుకొని నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మెలుమూరి శ్రీనివాస్, డైరెక్టర్లు గంట వెంకటరమణారెడ్డి, కేశవరెడ్డి, డా.శరణ్య మారుతి, బెల్లం జ్యోతి శ్రీనివాస్, దొడ్ల శ్రీనివాస్, కాటం సత్యం, శివ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

ఎలిగేడు,ఆగస్టు 29: ర్యాకల్‌దేవ్‌పల్లిలో కుక్కలదాడిలో లేగదూడ మృతి చెందింది. గ్రామరైతు కొత్తిరెడ్డి కమలాకర్‌రెడ్డికి చెందిన దూడను ఆరుబయట కట్టి వేయగా ఆటుగా వచ్చిన కుక్కలు దాడి చేయడంతో అక్కడి కక్కడే మృతి చెందింది. గ్రామంలో కుక్కలు స్వైరవిహారం చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల నివారణ తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ఓదెల, ఆగస్టు 29: ఓదెల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో క్రీడా, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఘనంగా నిర్వహించారు. మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం పురస్కరించుకుని ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పోటీలు జరిపారు. గిడుగు రామమూర్తి జన్మదినం సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని తెలుగులోనే మాట్లాడే క్రీడలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా క్రీడల ప్రాధాన్యత, తెలుగు భాషా గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి, ఆగస్టు 29 : జూలపల్లిలోని 'న్యూ బ్రిలియంట్' ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా ప్రాధాన్యతను వివరించారు. తెలుగు భాష పండిత ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఇక్కడ పాఠశాల కరస్పాండెంట్ కొండ సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్‌సిటీ, ఆగస్టు 29: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం వేడు కలు జరిగాయి. కళాశాల మినీ ఆడిటోరియంలో జరిగిన వేడకలకు రిటైర్డు తెలుగు ఉపాధ్యాయులు , కవి, రచయితలు పాల్గొని తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా వారు బాషా ప్రాముఖ్యతను వివరించారు. ఇక్కడ వక్తలు రాకు మార్, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా, తెలుగు అధ్యాపకురాలు ఎస్ సమత, ఉపాధ్యాయులు ఉన్నారు.

కమాన్‌పూర్: గౌతమిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కమాన్‌పూర్, ఆగస్టు 29 : మండలకేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి కరస్పాండెంట్ చదువు వెంకట్‌రెడ్డి ఉపాధ్యాయలు పూలమాలలు వేసి తెలుగుభాషా దినోత్సవం గురించి విద్యార్థిని, విద్యార్థులకు తెలియజేశారు. తెలుగు భాష గొప్పతనాన్ని తెలుగు భాషకు గుర్తింపు తెచ్చినటువంటి గిడుగు వెంకట రామమూర్తి సేవలను కొనియాడారు. అనంతరం పాఠశాలలో తెలుగు బోధిస్తు న్న గౌతమికి ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చదువు వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజమణి, భూలక్ష్మి, గౌతమి, రజిత, జేబా పాల్గొన్నారు.

అట్టహాసంగా తీజ్ మాత వేడుకలు

మొలకెత్తిన బుట్టలతో యువతులు

కోల్‌సిటీ, ఆగస్టు 29: గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని పోచమ్మ దేవాలయం ఆవరణలో బొందిల కుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి తీజ్ మాత వేడుకలు జరిగాయి. శ్రావణ మాసంలో బొందిల కులస్తులు జరుపుకునే ప్రత్యేక పండుగ ఇది. ప్రకృతిని తల్లిగా భావిస్తూ ప్రతి ఏటా శ్రావణ మాసంలో మహిళలు తమ ఇంట్లో వెదురుబుట్టలో ఎర్రమట్టిపేర్చి అందులో నవ ధాన్యాలు చల్లుతారు. తొమ్మిది రోజులు ఉపవాసం ఆచరిస్తూ ఉదయం, సాయంత్రం బుట్టలో నీళ్లు పోస్తూ పూజిస్తుంటారు. ఆ బుట్టలో మొక్కలు మొలకెత్తాక యువతులు వాటిని నెత్తిపై పెట్టుకొని డప్పు చప్పుళ్ల మధ్య పోచమ్మ గుడి నుంచి శ్రీరామాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ మొక్కలను అందరికీ పంచుతూ ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం గోదావరిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బైస జైసింగ్, శంకర్‌సింగ్, కిషన్‌సింగ్, మల్లయ్య సింగ్, లక్ష్మణ్, జ్యోతిబాయ్, కళ్యాణి బాయ్, గంగాధర, ప్రతాప్ సింగ్, కిషోర్‌తోపాటు మహిళలు, యువతులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

జూలపల్లి, ఆగస్టు 29 ః పంట రుణ మాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏవోప్రత్యూష సూచించారు. పెద్దాపూర్, కోనరావుపేట గ్రామానికి చెందిన రైతుల నుంచి గురువారం దరఖాస్తులు స్వీకరించారు. రేషన్ కార్డు లేకుండా పంట రుణాలు పొంది లబ్ధిపొందని రైతులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. అబ్బాపూర్, తేలుకుంట, వడ్కాపూర్ రైతు వేదికల్లో నేరుగా రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

'ఖని' కవయిత్రి అనూశ్రీకి జాతీయ పురస్కారం

కోల్‌సిటీ, ఆగస్టు 29ః గోదావరిఖనికి చెందిన కవయిత్రి, రచయిత్రి అనూశ్రీకి జాతీయ పురస్కారం దక్కింది. తెలుగు భాష పితామహులు గిడుగు రామమూర్తి పంతులు స్మారకార్థం ప్రతి ఏటా తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా సాహిత్యంలో విశిష్ట సేవలందిస్తున్న పలువురు కవులు, రచయితలకు జాతీయ పురస్కారంను ప్రదానం చేస్తున్నారు. దీనిలో భాగంగా విజయవాడలో గురువారం నవ్యాంధ్ర రచయితల సంఘం సారథ్యంలో గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, శంకరం వేదిక సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకల సందర్భంగా గోదావరిఖనికి చెందిన అనూశ్రీ రచించిన తొలి నవల 'వేద'కు జాతీయ పురస్కారం దక్కింది. ఈమేరకు కళారత్న బిక్కీ కృష్ణ, గిడుగు రాంమ్మూర్తి పంతులు మునిమనవరాలు కాంతి కృష్ణ, మల్లెతీగ పత్రిక సంపాదకులు కలిమి శ్రీ చేతుల మీదుగా అనూశ్రీని ఈ పురస్కారంతో ఘనంగా సత్కరించారు.

కొమ్ము రమేశ్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

పెద్దపల్లి, ఆగస్టు29: గోదావరి మల్టీ క్రెడిట్ కో- ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ 11వ వార్షికోత్సవ ముగింపు వేడుకలు మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విధులోల ప్రతిభ చూపిన గోదావరి అర్బన్ బ్యాంక్ మేనేజర్ కొమ్ము రమేష్‌కు రాష్ట్రస్థాయి అవార్డును అందజేశారు. పెద్దపల్లి బ్రాంచ్ మేనేజర్ కొమ్ము రమేష్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు దక్కడంతో బ్యాంకు డైరెక్టర్లు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

గరుకు స్తంభాల ప్రతిష్ఠాపన

మంథని రూరల్, ఆగస్టు29: మంథని మండలం భట్టుపల్లిలో కపిల గోశాలలో గరుకు స్తంభాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి పుట్ట మధూకర్ - శైలజ దంపతులు హాజరై పూజలు చేశారు.

వచ్చే నెల 30 లోపు సీఎంఆర్ డెలివరీ పూర్తి చేయాలి

పెద్దపల్లి, ఆగస్టు29: వచ్చే నెల 30 లోపు 2023 -24 వర్షాకాలానికి సంబంధించి పెండింగ్ సీఎంఆర్ డెలివరీ తప్పని సరిగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష మిల్లర్లను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో పెండింగ్ సీఎంఆర్ డెలివరీపై సమీక్షించారు. 2023-24కు సంబంధించి బాకీ ఉన్న సీఎంఆర్ డెలివరీ సెప్టెంబర్ 30 లోగా పూర్తి చేయాలని, గడువు పెంపు ఉండదని, నిర్దేశిత సమయం లోగా మిల్లుల వారీగా తమకు కేటాయించిన లక్ష్యం పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించారు.

కుట్టుమిషన్ సెంటర్ ప్రారంభం

కోల్‌సిటీ, ఆగస్టు 29: మహిళా ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా పట్టణ పేదరిక నిర్మూలన, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రామగుండం నగర పాలక సంస్థ 11వ డివిజన్ పరిధి కృష్ణానగర్‌లో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ సెంటర్‌ను కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్ గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌రాజ్ ఆదేశానుసారం ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని కాంక్షించారు. ఆర్పీ సునీత, అధ్యక్షురాలు కోదాటి రాజేశ్వరి, దొంత మల్ల పూజశ్రీ, కనుమల భావన, రమాదేవి, పులిపాకస్వరూప, కోదాటి మనీషా, సుచిత, సంధ్య, దాసరి శారద, లత పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు అవకాశం

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 29: రెగ్యులర్ విద్యకు వివిధ కారణాలతో దూరమైన విద్యార్థుల సౌకర్యార్థం విద్యాశాఖ దూర విద్యాకేంద్రాలను నిర్వహిస్తున్నదని, వాటి ద్వారా మెరుగైన విద్యను అందిస్తున్నట్లు పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లెర్నర్ సపోర్ట్ సెంటర్ ఇంచార్జి డాక్టర్ కే లక్ష్మీనర్సయ్య, కో ఆర్డినేటర్ మహ్మద్ అబ్దుల్ షకూర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో డిగ్రీ ప్రథమ సంవత్సరం అడ్మిషన్ల ప్రారంభ ప్రక్రియను పరిశీలించారు. ఈనెల 31 వరకు అడ్మిషన్‌లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్క రు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో స్కిల్ సంబంధిత కోర్సులు సైతం అందుబాటులో ఉన్నాయని అన్నా రు. విద్యార్థులకు జూమ్ ఆప్,యూట్యూబ్ ద్వారా కూడా తరగతులు నిర్వహించడం జరుగుతుందని అన్ని రకాల పోటీ పరీక్షలకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సర్టిఫికేట్‌లు చెల్లుబాటు అవుతాయని అన్నారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ట్యూషన్ ఫీజు చెల్లించుటకు ఈనెల 31 వరకు అవకాశం ఉందని దీనిని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. వివరాలకు కళాశాలలోగాని 73829 29654లో సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

మహిళ ఆత్మాహత్యాయత్నం

జ్యోతినగర్(రామగుండం), ఆగస్టు 29: రామగుండం పట్టణంలోని కబ్రస్తాన్ వద్ద బుధవారం రాత్రి రైలు పట్టాలపై ఓ మహిళా ఆత్మహయత్నకు యత్నించింది. రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జీ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని మహిళ ఆత్మహత్యయత్నకు యత్నించగా తలకు బలమైన గాయమైంది. గురువారం గోదావరిఖని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా చికిత్సపొందుతున్నట్లు తెలిపారు. గాయపడిన ఈ మహిళా ఆచూకి తెలిసిన వారు 9949304574 సెల్‌ఫోన్‌ను సంప్రదించాలన్నారు.

ముడుపు కట్టిన భక్తులు

జూలపల్లి, ఆగస్టు 29 : జూలపల్లిలో పోచమ్మ తల్లిని ఎల్లనం పడానికి గ్రామస్తులు సన్నాహాలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో గురువారం కుల సంఘాల నాయకులు, భక్తులు డప్పు చప్పుళ్ల నడుమ పోచమ్మ ఆలయాలకు తరలి వెళ్లారు. దేవతామూర్తులను దర్శించుకుని జలాభిషేకాలు చేశారు. ఊరు పొలిమేరలోని ఊర పోశమ్మ, నల్ల పోశమ్మ, కొండ పోశమ్మ, ముత్యాల పోశమ్మ, అందెపల్లె పోశమ్మ తల్లి ఆలయాల్లో నిర్వాహకులు ముడుపులు కట్టారు. ఊరంతా సల్లంగ చూడాలని ప్రత్యేక పూజలు చేశారు. వచ్చే నెల 25, 26 తేదీల్లో పోశమ్మ ఉత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఇక్కడ కుల సంఘాల నాయకులు పొట్టాల మల్లేశం, కొప్పుల మహేశ్, పాటకుల అనిల్, చీదురు శ్రీనివాస్, నాడెం శ్రీధర్, ఆవుల ఐలయ్య, మెండ రాజయ్య, గడ్డం నర్సింహారెడ్డి, సిరికొండ కొమురయ్య, బండి స్వామి, వంగపెల్లి వెంకటరమణ, గంగిపెల్లి భూమ య్య, తుమ్మ సత్యం, మేర శ్రీనివాస్, పొలగాని సతీశ్ పాల్గొన్నారు.